# దేశానికి యాక్సిడెంట్

(5వ పేజీ తరువాయి)

రు. బంగారాలు పెరిగాయి. దేశంలో బంగారం చాలక బిస్కెట్ల బంగారమూ కొన్నారు.

ఇంజనీర్ మూర్తి రిటైర్ అయ్యే రోజు దగ్గర కొస్తోంది. అతనికి బెంగపట్టుకుంది. ఇన్నాళ్లూ సేవ చేసిన రైల్వే శాఖని శాశ్వతంగా విడిచిపెట్టేయ్యాలా? పనేం లేకుండా చేతులు కట్టుకుని కూచోవాలా? గుండె బరువెక్కిపోతోంది?

రైలుతో తనకి ఎలాంటి సంబంధంలేదు. ఎలాంటి సెంటిమెంటూలేదు. ఇంత కాలం పనిచేసిన ఉద్యోగశాఖలో ఏదో ఒక రకమైన అవినాభావ సంబంధం ఏర్పడాలి.

కాని మూర్తికి లేదు.

ఆ బాంధవ్యం ఒకానొకప్పుడు ఉండేదేమో!

సమాజం మారిపోతోంది.

విలువలు మారిపోతున్నాయి.

సెంటిమెంట్లు చచ్చిపోతున్నాయి.

రిటైరైపోతున్నాననే బెంగ తప్ప మరో బాధలేదు. మరో రెండేళ్లు పొడిగిస్తే మరో రెండు కోట్లు గడించుకోవచ్చు.

ఇప్పటికి గడించుకున్న కోట్లు వేరు. ఇప్పుడు సంపాదించుకునే గడింపువేరు.

డాక్టర్ రావ్ అనేవాడు. "రోజుకో ఏక్సిడెంట్ అవ్వాలని నువ్వే కోరుకుంటావ్" అని అప్పట్లో ఆశ్చర్యపోయేవాడు మూర్తి. కాని ఇప్పుడు నిజంగానే కోరుకుంటున్నాడు. కాని పైకి చెప్పడు. డాక్టర్ రావ్‌ని గుర్తుకు తెచ్చుకోడు.

మంత్రొచ్చి ఏ అవాకులు చవాకులు వాగినా "జీసాబ్' అనడం నేర్చుకున్నాడు.

మంత్రికంటే ముందు తనే అనేసేవాడు "విద్రోహ చర్య" అని.

ఎవరా విద్రోహులు? ఎక్కడుంటారు? ఏమి ఆలోచించడం లేదు. ఎవడో పైవాడి మీదికి నెట్టెయ్యాలి. ఆ వాళ ఇద్దరి కూతుర్ల నుంచీ ఫోన్ పిల్లలతో పాటు అంతా కోరమండల్‌లో వస్తున్నామని.

"ఈ వయస్సులో మీరెందుకు డాడీ కారు పంపించండి"

"కాదు వస్తానమ్మా"

అయితే ఆ కోరమండల్ చేరనేలేదు. ఒంగోల్ దగ్గర ఏక్సిడెంట్.

అతనికి గుండాగినంత పనయింది.

కాంట్రాక్టర్ మనుషులొచ్చారు.

తనే కారు తీసుకుని భార్యతో బయలుదేరాడు.

సెకండ్ ఏసిలో వస్తున్నారు కూతుర్లు, పిల్లలు. ఏ కంపార్టుమెంటూ 'బతికి' లేదు. లోపల జనం చాలమందే పోయారు. ఎంత మంది పోయారు? దాదాపు మూడొందల మంది పోయారు. కాని చివరి సున్నా చెరిపేసి ముప్ఫయిమందని చెప్పాలా? నో. ఐదొందల మంది పోయారు. కాదు ఐదు లక్షలు, కాదు యాభై కోట్లు.

పిచ్చిగా అరిచాడు మూర్తి.

భార్య గబుక్కున లేచి వొణికిపోతున్న భర్తని పట్టుకుంది. ఏమయింది? ఏమయింది? అంది ఆతృతగా.

ఏక్సిడెంట్ ఏక్సిడెంట్. మన పిల్లలిద్దరూ కలవరిస్తున్నట్లు మూర్తి వొణికి పోయాడు.

"అబ్బా! ఎప్పుడూ ఏక్సిడెంట్లూ మీరూ. ఇక వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోండి. కావల్సినంత వుంది. ఈ చిన్న కుటుంబానికి లేదని లేదు. మానెయ్యండి" ఆమె ఏడుస్తోంది. అతని ఆరోగ్యం యిద్దైపోతోందని దిగులు. అక్కడ ఏక్సిడెంట్స్‌లో ప్రాణాలే పోతున్నా చలించని మూర్తి ప్రాణం కోసం ఇంకా ఇంకా ఏక్సిడెంట్స్ జరగాలని కోరుకునే మూర్తిలాంటి స్వార్థపరుడి కోసం కలవరించే ప్రాణి ఒకతుంది.

ఆ ఏక్సిడెంట్ నిజంగా విద్రోహ చర్యే. ఇంజన్ డ్రైవర్ బ్రేకు దగ్గరే గుండాగి చనిపోయాడు. బండికి సిగ్నల్ ఇవ్వలేదని ప్రాణం లేని డ్రైవర్ చూడలేకపోయాడు. ఫలితం ఏక్సిడెంట్. అలాంటి రోగిష్టి డ్రైవర్‌కి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చింది ఎవరు? ఈ డాక్టర్ రావేనా? ఎంత తీసుకున్నాడు. ఆ సర్టిఫికెట్ కోసం? ఐదా? పదా? లంచగొండి వెధవ! వాడి సర్టిఫికెట్ వల్ల కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కి ప్రమాదం.

నిన్న జరిగిన ప్రమాదం అది. ఈవాళ కలలోకి వచ్చింది. అందులో తన కూతుర్లే ప్రయాణం చేస్తున్నట్లు కల. నిజంగా వాళ్ళు ప్రమాదంలో చనిపోతే? తను భరించగలడా? నో.... ప్రమాదాలు జరగకూడదు. జరక్కూడదు.

దేశం యావత్తు తిరగబడింది. రైల్వే మినిష్టర్ కోట్లు తినేస్తున్నాడని కోర్టు మందలించింది. మందలించింది కాని జైల్లో పెట్టలేదు. న్యాయం అతని వరకూ వెళ్లదా.... నో.. ఏదో జరిగింది. భగవంతుడు ఎక్కడో ఉన్నాడు. ఏదో మంత్రం వేసి ఉంటాడు.

దేశంలో రైల్లు ప్రమాదాలు జరగడం లేదు. ఎక్కడా గూడ్స్ బండయినా పడిపోవడంలేదు. వారం ..రెండు వారాలు... నెల భగవంతుడే ఆపేశాడు ఏక్సిడెంట్స్‌ని.

ఒక్క ఏక్సిడెంటూ జరగడంలేదు. గిజగిజలాడిపోతున్నారు ఏక్సిడెంట్స్ శవాల ముఠా, కాంట్రాక్టుల మీదా బతికే స్వార్థపరులు, భగవంతుడా! ఎందుకు ఏక్సిడెంట్స్‌ని ఆపేశావు? నీ దగ్గర కొస్తాను. తలనీలాలు యిస్తాను. ఒక్క ఏక్సిడెంట్.. కనీసం వారానికి వొకటి.

భగవంతుడు వీళ్ల కోరికను మన్నించలేదు. కోపం వచ్చింది కాంట్రాక్టరుకి. ఒక నిశ్చయానికి వచ్చాడు కాంట్రాక్టరు. బాగా తాగేశాడు. తాగించేశాడు.

'తుని దగ్గర ఏక్సిడెంట్ జరిగితే నలభై అడుగుల ఎత్తునున్న ట్రాక్ సమూలంగా నాశనం అయిపోతే?" కాంట్రాక్టర్ కలవరిస్తున్నాడు.

చుట్టూ తాగుతూ కూర్చున్న అతని మిత్ర బృందం అతని బాధని కలవరింపుని అర్థం చేసుకుని సానుభూతితో అతని భుజం తట్టారు.

"ఓకే బాస్ ఒక చిన్న ఏక్సిడెంటేగా? ఒకే జరిగిపోతుంది" ఇంకా ఇంకా తాగారు.

తాగుబోతుల ప్రేలాపనలు కావవి. ఎనభై ఏడుకోట్ల భారతీయుల పాలిట రాక్షసులు చేసే ప్రళయకాల హాహాకారాలు!

మర్నాడు పొద్దునే నిజంగా రైలు పడిపోయింది. తుని దగ్గరే. నలభై అడుగుల ఎత్తునున్న రైలు లైను తునా తునకలైపోయింది ట్రాక్.

విధ్వంసక చర్య.. విద్రోహ చర్య.. ఎవరు విద్రోహులు.. కమిషన్‌ని వేశారు.

మధ్యలో మూర్తికి మరో రెండు సంవత్సరాల ఉద్యోగకాలం పెరిగింది. ఎక్స్‌టెన్షన్, తృప్తిగా నవ్వుకున్నాడు మూర్తి. కాంట్రాక్టరు కూడా నవ్వుకున్నాడు. స్వార్థపరులంతా నవ్వుకున్నారు. నవ్వుకుంటూనే ఉంటారు.